పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లకు అనుమతి తప్పనిసరి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులు, జంక్షన్లు, చౌరస్తాలు, పబ్లిక్ ప్రదేశాలలో పోస్ట ర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటుకు తప్పనిసరి మున్సిపల్ నుంచి అనుమతి తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే భారీ జరిమానాతోపాటు చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర పరిశుభ్రత, సుందరీ కరణ, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పబ్లిక్ స్థలాలు, జంక్షన్లు, చౌరస్తాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటును నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం అధికారులు నగరంలో పర్యటించి అనుమతి లేని బ్యానర్లు, ఫ్లెక్సీలకు సంబంధించిన వ్యాపార సంస్థలకు 15 వేల రూపాయల జరిమానా విధించారు.



‘రాంలీల’కు రాజకీయ సెగ



- మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌కు తాళం
- గ్రౌండ్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా
- కాంగ్రెస్ నేతలు ఒత్తిడి తెచ్చారని విమర్శలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

దసరా సందర్భంగా నగరంలోని రాంనగర్ మార్క్‌ఫెడ్ మైదానంలో రాంలీల వేడుకలను ఆ ప్రాంత మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈసారి రాంలీల కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. గురువారం విజయదశమిరోజు ఈ వేడుక జరగాల్సి ఉండగా మంగళవారం మైదానం గేట్లకు అధికారులు తాళం వేశారు. అధికారపార్టీకి చెందిన పెద్దలు ఈ కార్యక్రమం తామే నిర్వహిస్తామంటూ అధికా రులపై ఒత్తిడి తెచ్చి మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌కు తాళం వేయించారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు.



మార్క్‌ఫెడ్ గ్రౌండ్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పరస్పర ఆరోపణలు

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా చేసే కార్యక్రమానికి ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ ఏర్పాట్లు చేస్తున్న క్రమంలోనే సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, కాంగ్రెస్ నాయకులు వెళ్లి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహిస్తామని చెప్పారు. అందరం కలిసి రాజకీయలకతీతంగా నిర్వహిద్దామని బీఆర్ఎస్ నాయకులు అనడంతో అప్పటికి వ్యవహారం సద్దుమణిగింది. మంగళవారం మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌కు తాళం వేయడంతో వివాదం మళ్లీ మొదటికి వచ్చింది.





దుర్గామాత నమోస్తుతే..

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గాష్టమిని పురస్కరించుకొని అమ్మవారిని దుర్గామాత రూపంలో మంగళవారం భక్తులు కొలిచారు. కరీంనగర్ మహాశక్తి ఆలయంలో దుర్గామాత (సిద్ధిధాత్రి) పూజ జరిపి రత్నాలతో, దీపాలతో అలంకరించారు. సాయంత్రం నేత్రపర్వంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయం జనంతో కిక్కిరిసిపోయింది. రతన్‌కుమార్ బృదం ఆలయ సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. యజ్ఞవరాహక్షేత్రంలోని వరదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబజార్ గౌరీశంకరాలయంలో దుర్గాదేవి అలంకరణ చేశారు. శ్రీపురంలో దుర్గామాత పూజల అనంతరం బతుకమ్మ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామదిరంలో అమ్మవారికి విష్ణుసేవానందగిరిస్వామి పూజలు చేసి ప్రవచనం చేశారు.





పల్లకీ సేవలో పాల్గొన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పాల్గొన్న భక్తులు







‘స్థానిక’ ఎన్నికల షెడ్యూల్ విడుదల

కరీంనగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల షెడ్యూల్‌ను స్థానిక ఎన్నికల సంఘం విడుదల చేసింది. జిల్లాలో నిర్వహించనున్న ఎన్నికల వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రామ పంచాయతీ ఎన్నికలు — మొదటి విడతలో..

నామినేషన్ల స్వీకరణ	అక్టోబరు 21
చివరి తేదీ	అక్టోబరు 23
పరిశీలన	అక్టోబరు 24
ఉపసంహరణ	అక్టోబరు 27
ఎన్నికల తేదీ, ఫలితాలు	నవంబరు 4

(మానకొండూర్ మండలం మినహా కరీంనగర్ డివిజన్‌లోని గ్రామాలు)

గ్రామ పంచాయతీ ఎన్నికలు — రెండో విడతలో..

నామినేషన్ల స్వీకరణ	అక్టోబరు 25
చివరి తేదీ	అక్టోబరు 27
పరిశీలన	అక్టోబరు 28
ఉపసంహరణ	అక్టోబరు 31
ఎన్నికల తేదీ, ఫలితాలు	నవంబరు 8

(మానకొండూర్ మండలం, హుజూరాబాద్ డివిజన్‌లోని గ్రామాలు)

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు — తొలి విడతలో..

నామినేషన్ల ప్రారంభం	అక్టోబరు 9
చివరి తేదీ	అక్టోబరు 11
పరిశీలన	అక్టోబరు 12
ఉపసంహరణ	అక్టోబరు 15
ఎన్నికల తేదీ	అక్టోబరు 23
ఓట్ల లెక్కింపు	నవంబరు 11

(హుజూరాబాద్ డివిజన్‌లోని మండలాలు)

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు — రెండో విడతలో..

నామినేషన్ల ప్రారంభం	అక్టోబరు 13
చివరి తేదీ	అక్టోబరు 15
పరిశీలన	అక్టోబరు 16
ఉపసంహరణ	అక్టోబరు 19
ఎన్నికల తేదీ	అక్టోబరు 27
ఓట్ల లెక్కింపు	నవంబరు 11

(కరీంనగర్ డివిజన్‌లోని మండలాలు)








గార్బేజ్ పాయింట్స్‌లో చెత్తవేస్తే జరిమానా

కరీంనగర్ టౌన్, సెప్టెం బరు 30 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని 16 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గార్బేజ్ పాయింట్స్‌లో చెత్త వేస్తే జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నుంచి గార్బేజ్ పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిబ్బందితో పాటు పారిశుధ్య విభాగానికి చెందిన ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్ ప్రతిరోజు గార్బేజ్ పాయిం ట్లను పరిశీలించాలన్నారు.చెత్త కలెక్షన్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరిమానా విధిస్తామని చెప్పారు.
















సార్వజనీనం... సంగీతం..
- నేడు అంతర్జాతీయ సంగీత దినోత్సవం

7

శాకాహారమే మేలు
- నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం

6



సీనియర్ మెన్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో

రన్నరప్‌గా ఉమ్మడి జిల్లా జట్టు



రన్నరప్‌గా నిలిచిన ఉమ్మడి కరీంనగర్ ఫుట్‌బాల్ జట్టు

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి 28వరకు జరిగిన సీనియర్ మెన్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కరీంనగర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మొత్తం 12జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ఫైనల్‌లో కరీంనగర్ జట్టు, వనపర్తితో తలపడింది. రన్నరప్‌గా నిలిచిన కరీంనగర్ జట్టుకు నిర్వాహకులు ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన జట్టుకు ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రధాన కార్యదర్శి గణపతి, సభ్యులు అభినందించారు.

విచ్చలవిడిగా బెల్టుషాపులు

● పండుగ వేళ గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం



సుల్తానాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అనధికారికంగా నడుస్తున్న బెల్టు షాపుల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలి చేసుకుని సంపాదించిన డబ్బును చాలా మంది మద్యం మీద ఖర్చు చేస్తూ కుటుంబ పోషణను విస్మరిస్తున్నారు. దీంతో మహిళలు, పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్నారని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. దసరా పండగ సందర్భంగా బెల్టుషాపుల నిర్వాహకులు ఇప్పటి నుంచి మద్యం నిల్వలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామాల్లో రెండు, మూడు రోజులుగా మద్యం ఏరులై పారుతున్నది. యువత మద్యానికి బానిసలుగా మారుతున్నారు. ప్రతి గ్రామంలో బెల్టుషాపులు ఉండటంతో ఏ సందర్భమైనా మద్యంతో విందు చేసుకుంటున్నారు. ఆరోగ్య సమస్యలు, అప్పులు, కుటుంబ కలహాలు పెరిగిపోతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగుడుకు బానిసైన వారు కుటుంబ సభ్యులతో ఘర్షణకు దిగుతున్నారు. పిల్లల చదువులు, మహిళల జీవన స్థితి ప్రభావితమవుతుందని మహిళలు చెబుతున్నారు. సంపాదించిన డబ్బంతా తాగుడుకే పోతుందని, పిల్లలకు తిండి పెట్టడమే కష్టమవుతోందన్నారు. ప్రభుత్వం బెల్టుషాపులను మూసి వేయాలని వారు కోరుతున్నారు.

సుల్తానాబాద్ మండల వ్యాప్తంగా గతంలో వేలం పాటలో పాల్గొని మద్యం దుకాణాలు దక్కించుకున్న సంఘటనలు ఉండేవి. ప్రస్తుతం అధికారికంగా అనుమతించిన దుకాణాలు 10లోపే ఉన్నాయి, కానీ బెల్టు షాపులు మాత్రం వందల సంఖ్యలో ఉండటం గమనార్హం. కొందరు యువకులు పాఠశాల స్థాయిలోనే మద్యానికి బానిసగా మారి చదువు మానేశారని ఓ ఉపాధ్యాయుడు పేర్కొన్నారు. రోజు మద్యం సేవించడం వల్ల కాలేయ సంబంధిత వ్యాధులు, రక్తపోటు, మానసిక ఒత్తిడి తదితర సమస్యలు ఎక్కువ అవుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

శాకాహారమే మేలు



నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు ఆహారం ఎంతో ముఖ్యం. ఆహారం స్వీకరించకపోతే జీవక్రియలు సరిగ్గా పని చేయక మనిషి చిక్కి శల్యమై చివరకు మరణిస్తాడు. మానవ జీవన విధానంలో రెండు రకాల ఆహారాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఒకటి శాకాహారం. మరొకటి మాంసాహారం. అక్టోబరు ఒకటో తేదీన ప్రపంచ శాకాహార దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

ఏ ఆహారం ఎవరెవరు స్వీకరిస్తారు?

సాధారణంగా పూర్వకాలంలో మనుషులు శాకాహారం తీసుకునేవారు. ఓ సందర్భంలో పచ్చి ఆకు కూరలు, కూరగాయలు మాత్రమే తిని చాలా సంవత్సరాలు జీవించేవారు. జంతువులు మాంసాహారం అంటే చివరకు మనుషులను సైతం తినేవి. కొన్ని పక్షులు, మరికొన్ని జంతువులు శాకాహారం తీసుకునేవి ఉన్నాయి. శాకాహారం కింద ఆకుకూరలు, కాయలు, పండ్లు, దుంపలు, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, బెల్లం, పప్పు దినుసులు, తృణ ధాన్యాలు వంటివి. మాంసాహారం అంటే కోడి, మేక, గొర్రె, పొట్టేలు, ఇతరత్రా కొన్ని జీవాలు వస్తాయి. మానవుల్లో మాంసాహారానికి ప్రాధాన్యమిస్తారు. దీనికి కారణం శాకాహారంలో బలం ఉండడం లేదనే అపోహ. సరైన రీతిలో వండుకొని ప్రణాళిక ప్రకారం శాకాహారం తీసు కుంటే మాంసాహారుల కంటే బలవర్ధులమౌతామని శాకాహారులు చెబుతున్నారు. కూరగాయల్లో ఏఏ విటమిన్లు, ప్రొటీన్లు ఉంటాయో ఆయా సందర్భాల్లో వివరించి అవగాహన కలిగిస్తున్నారు.

దినోత్సవ నేపథ్యం

మూగ జీవాలపై మానవ ప్రేమను ప్రోత్సహించి, పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకునే దిశలో ఏటా అక్టోబరు 1న శాకాహార దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాకాహారులను ఒక వేదిక పైకి తీసుకొచ్చేందుకు 1970లో ఉత్తర అమెరికా శాకాహార సొసైటీగా ఏర్పడింది. 1977లో తొలిసారి అమెరికాలో ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. 1978లో అంతర్జాతీయ శాకాహారం యూనియన్ ఆమోదం తెలిపింది. అక్టోబరు నెల శాకాహార అవగాహన నెల ప్రారంభమై నవంబరు 1న ప్రపంచ వేగన్ దినోత్సవంతో ముగుస్తుంది.

శాకాహారంతో లాభాలు

శాకాహారం తీసుకోవడం ద్వారా శరీరం ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుంది. త్వరగా అరుగుదల ఉంటుంది. పౌష్టిక, ఆరోగ్యకర, సమీకృతాహారం శరీరానికి అందుతుంది. కొన్ని మం దులు కూడా ఆకు కూరలు, కాయల నుంచి ఉత్పత్తి చేస్తున్నారంటే శాకా హార పదార్థాల విలువ తెలియక మానదు. రోగాలు దరి చేరకుండా ఉంటాయి. వయోపరిమితి పెరుగుతుంది. శరీర అవయవాలకు రక్తం సక్రమంగా చేరుతుంది. అందుకే కొన్ని సంస్థలు శాకాహార పద్ధతులు, ప్రయోజనాలపై మానవాళికి అవగాహన కల్పిస్తున్నాయి. మాంసాహారం కంటే శాకాహారమే మేలని పలు అధ్యయనాలూ చెబుతున్నాయి. శాస్త్రవేత్తలు కూడా ధృవీకరిస్తున్నారు. ప్రస్తుతం ఆర్గానిక్ వ్యవసాయం ద్వారా కూడా పండే కూరగాయలు లభిస్తున్నాయి. మందులు, రసాయనాలు వాడని వాటిని తింటే ఇంకా మంచిది.



ఎల్లమ్మ తల్లి ఆలయంలో గుడి గంటలు చోరీ

ఇల్లందకుంట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలోని గుడి గంటలు సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు దేశిని మహేష్ తెలిపారు. మంగళవారం ఉదయం గీతకార్మికులు ఎల్లమ్మ ఆలయానికి పూజ కోసం వెళ్లగా ఆలయం లో ఉన్న రూ. 30వేల విలువ గల ఇత్తడి గంటలు కనిపించడం లేదు. ఈ విషయం పై ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.గతంలో కూడా మూడు సార్లు చోరీ జరిగినట్లు వారు పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీ

శంకరపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎల్లమ్మ, మల్లన్న దేవాలయాల్లో తలుపులు తెరిచి, హుండీల్లో ఉన్న సుమారు రూ. 25వేల నగదు దొంగలించిన సంఘటన చోటు చేసుకుంది. ఈ విషయంపై బొంగుని రవీందర్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

దొంగిలించిన గొర్రెలను పట్టుకున్న పోలీసులు

రుద్రంగి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దొంగిలించిన గొర్రెలను ఆటో ట్రాలీలో తరలిస్తుండగా రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం రాత్రి పెట్రోలింగ్ పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో మూడు గొర్రెలను, ఒక మేకను దొంగిలించి ట్రాలీ ఆటోలో వేములవాడకు తరలిస్తుండగా రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ చౌరస్తాలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ట్రాలీని అడ్డుకోవడంతో డ్రైవర్ ఆపకుండా పారిపోయే ప్రయత్నం చేశాడు.

దీంతో వెంటనే ఆటోను ఆపి చూడగా అందులో మూడు గొర్రెలు, ఒక మేకను గుర్తించారు. గొర్రెలను దొంగిలించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు ● పండుగ పూట విషాదం



పూదరి రోహిత్, ముత్యం రాకేష్ (ఫైల్)

సుల్తానాబాద్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ శివారు రైల్వే గేటు సమీపంలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ఇద్దరు యువకులు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని గౌడ వీధికి చెందిన ముత్యం రాకేష్(29), పూదరి రోహిత్(24) అలియాస్ అభి, సుగ్లాంపల్లి గ్రామానికి చెందిన పాపని ఆదర్శ్‌లు బైకుపై సుల్తానాబాద్ నుంచి సుద్దాలకు వెళుతున్నారు. అల్లీపూర్‌కు చెందిన గసిగంటి రఘు బైక్‌పై వస్తుండగా రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వీరిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పూదరి రోహిత్ మృతి చెందగా, ఆసుపత్రిలో ముత్యం రాకేష్ మరణించాడు. గాయపడ్డ పాపని ఆదర్శ్‌తోపాటు అల్లీపూర్‌కు చెందిన రఘు ఆసుపత్రిలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో రాకేష్ రోహిత్‌లు మామఅల్లుళ్లు. రాకేష్ అక్క కొడుకు రోహిత్. మృతుల్లో ముత్యం రాకేష్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, రోహిత్ పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్ హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ తదితరులు సంఘటన స్థలాన్ని, ఆసుపత్రిలో బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు



రికార్డు హోల్డర్లను అభినందిస్తున్న కలెక్టర్ కోయశ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించిన రామగిరి మండలం సెంటి నరీకాలనీకి చెందిన ఇద్దరు తండ్రీ కొడుకులను కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అభినందించారు. ఇటీవల లెంకల వివేకానంద రెడ్డి, మహిపాల్‌రెడ్డిలు యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్ 5642 మీటర్ల పర్వతాన్ని ఆగస్టు నెలలో అధిరోహించారు. ఈ సందర్భంగా వారు మత్తు పదార్థాల పట్ల అవగాహన బ్యానర్లను ప్రదర్శించగా, తెలంగాణ నుంచి పర్వతాన్ని అధిరోహించిన వీరు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డును కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు. జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ రెడ్డితోపాటు పలువురు అధికారులు ఉన్నారు.

కోడ్ అమలుతో ముమ్మర తనిఖీలు



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసు

కోల్‌సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు ముమ్మర తనిఖీలు జరుపుతున్నారు. మంగళవారం సాయంత్రం గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని బస్టాండ్, జీఎం కాలనీ చౌరస్తా, ఫైవింక్లయిన్ చౌరస్తాలో విస్తృత తనిఖీ చేశారు. నగదు, మద్యం రవాణాపై దృష్టి పెట్టారు. బస్సుల్లో తనిఖీ చేశారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు రమేష్, అనూష పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లి రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు మంగళవారం ఐదు కిలోల గంజాయిని పట్టుకొని ముగ్గురిని అరెస్టు చేశారు. రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. తీగలగుట్టపల్లి రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. కరీంనగర్ నుంచి నగునూర్ వైపునకు బైక్‌పై వెళ్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా ఐదు కిలోల 20 గ్రాముల గంజాయి పట్టుబడింది. నిందితులు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూర్‌కు చెందిన నలిమెల వినోద్(28), మానకొండూర్‌కు చెందిన కొండ్ర ప్రశాంత్(21), రొడ్డ సాయి అఖిల్(21)ని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కొత్తగూడెంలో గంజాయిని కొనుగోలు చేసి కరీంనగర్‌లోని ప్రతిమ వైద్యకళాశాల వద్ద విద్యార్థులకు, రైల్వేస్టేషన్ వద్ద హమాలీలు, లారీ డ్రైవర్లకు విక్రయించేందుకు పథకం వేశారని సీఐ తెలిపారు. నిందితుల నుంచి ఒక బైక్, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

కావలెను

★ పెట్రోల్ బంక్‌లో పంప్ ఆపరేటర్స్‌గా పనిచేయుటకు పురుషులు మరియు మహిళలు కావలెను. కమాన్ టూ హౌజింగ్ బోర్డ్ రోడ్, కరీంనగర్. సెల్ : 93930 95950

AJK-250579

CHANGE OF NAME

★ I MULA MAHENDER REDDY S/O. MULA MALLA REDDY, AGED: 45 YRS, H.NO. 8-2-104/B, VASUDEVA COLONY, KATTARAMPUR, KARIMNAGAR - 505001. I HAVE CHANGED MY NAME FROM M MAHENDER (OLD NAME) TO MULA MAHENDER REDDY S/O MULA MALLA REDDY (NEW NAME) FOR ALL THE PURPOSES

AJK-238569

CHANGE OF NAME

★ I, BALMURI KARUNAKAR RAO, S/O. BALMURI BHOOM RAO, H.NO. 3-7-223, VAVILALAPALLY, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS "BALMOORI KARUNAKAR RAO" S/O. "BALMOORI BHOOM RAO"

AJK-17280

CHANGE OF NAME

★ I, BALMURI SABITHA, W/O. BALMURI KARUNAKAR RAO, H.NO. 3-7-223, VAVILALAPALLY, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS "BALMOORI SABITHA" W/O. "BALMOORI KARUNAKAR RAO"

AJK-17280

CHANGE OF NAME

★ I,"PAMULA SATYAMMA GANGARAJAM "W/O. PAMU GANGARAJAM, R/O. H.NO: 1-79, KOLIMIKUNTA, KARIMNAGAR. I HAVE CHANGED NAME & SURNAME AS "PAMU SATHAMMA" W/O. PAMU GANGARAJAM.

AJK-17282

CHANGE OF NAME

★ I,"PAMULA PRABHAKAR GANGARAJAM" S/O. LATE PAMULA GANGARAJAM GANGARAM, R/O. H.NO:1-79, KOLIMIKUNTA, KARIMNAGAR. I HAVE CHANGED NAME & SURNAME AS "PAMU PRABHAKAR" S/O. LATE PAMU GANGARAJAM.

AJK-17281

CHANGE OF NAME

★ I,"PAMULA SUJATHA PRABHAKAR "W/O. PAMU PRABHAKAR, R/O. H.NO :1-79, KOLIMIKUNTA, KARIMNAGAR. I HAVE CHANGED NAME & SURNAME AS "PAMU GANGA" W/O. PAMU PRABHAKAR.

AJK-17282

LAND REQUIRED

★ భూమి కావలెను 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సం॥ప్ర॥ 9440522536, 7013226716

AJW-243433

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని సీపీ గౌస్‌ఆలం అధికారులను ఆదేశించారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో సీపీ అధ్యక్షతన పోలీసు అధికారులతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తక్షణం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. కమిషనరేట్ కేంద్రంలో ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి అనుభవజ్ఞులైన అధికారులను, సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ఈ సెల్ కమిషనరేట్ వ్యాప్తంగా అధికారులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తుందన్నారు. త్వరలో ఆరు అంతర్ జిల్లా చెక్ పోస్టు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, ఈ చెక్ పోస్టుల వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేరస్థులను, రౌడీ షీటర్లను ఆయా రెవెన్యూ అధికారుల ఎదుట బైండ్ ఓవర్ చేయాలన్నారు. సరైన ఆధారాలు లేకుండా 50 వేలకంటే ఎక్కువ నగదును వెంట తీసుకువెళ్లరాదని, ఈ నిబంధన ఉల్లంఘిస్తే ఆ మొత్తాన్ని సీజ్ చేయాలని సీపీ ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌కు కేటాయించే అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు.

● దసరా, దుర్గా దేవి నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

దసరా పండుగ సందర్భంగా కమిషనరేట్ వ్యాప్తంగా రాంలీలా మైదానాలు, దుర్గా దేవి నిమజ్జనం సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ గౌస్‌ఆలం అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున, రాజకీయ అల్లర్లు జరగకుండా నివారించడానికి అవసరమైన పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు.

నకిలీ ఎలక్ట్రిక్ వైరు అమ్ముతున్న వ్యక్తిపై కేసు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 30(ఆంధ్రజ్యోతి): నకిలీ ఎలక్ట్రిక్ వైరు అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వీగార్డ్ కంపెనీకి చెందిన రీజినల్ హెడ్ నాగేశ్వరరావు మంగళవారం పట్టణంలోని పలు ఎలక్ట్రికల్ షాపులు తనిఖీలు చేపట్టారు. నిజామాబాద్ రోడ్డులో ఉన్న నవదుర్గ ఎలక్ట్రికల్ షాపుకి వెళ్లి గార్డ్ కేబుల్స్ ఆర్డర్ చేయగా షాపు యజమాని అతనికి విగార్డ్‌కి సంబంధించిన నకిలీ వైరు బెండల్ ఇచ్చాడు. వాటి నాణ్యత సరిచూసుకుని నకిలీవని గ్రహించి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అతని వద్ద నుంచి 1,17,360 విలువ గల 37 నకిలీ కేబుల్ వైరు బెండలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు నవదుర్గ ఎలక్ట్రికల్ షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పండుగ పూట కంచర్లలో విషాదం

- స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం
- అనారోగ్యంతో దినసరి కూలీ మృతి



హన్మంతు, చిన్న లస్మయ్య (ఫైల్)

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): పండుగ పూట ఇల్లంతా సంతోషంగా గడుపుతున్న ఆ కుటుంబంలో అరబ్బు దేశంలో ఉంటున్న పెద్ద దిక్కు దేవోళ్ల హన్మంతు(36) అకాల మరణం తీరని శోకాన్ని మిగిల్చింది. అనారోగ్యంతో బాధ పడుతున్న దినసరి కూలీ దండుగుల చిన్న లస్మయ్య(56) చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఒకే రోజు రెండు మృత దేహాలు గ్రామానికి చేరడంతో వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో మంగళవారం విషాదం నిండింది. దేవోళ్ల హన్మంతుకు కొడుకులు లేక పోవడం.. దండుగుల చిన్న లస్మయ్య కొడుకు విజయ్‌కుమార్ దుబాయి దేశంలో ఉండడం వల్ల కట్టుకున్న ఇల్లాలు పద్మ, లక్ష్మీలు అన్నీ తామై అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మృతుల కుటుంబాలు సమీప బంధువులు కావడంతో ఇరు కుటుంబాలు దుఃఖంలో మునిగిపోయాయి. దేవోళ్ల హన్మంతు యేడాదిన్నర క్రితం సుమారు రూ.6 లక్షలు అప్పులు చేసి బహ్రెయిన్ వెళ్లాడు. గత నెల 26న ఛాతీలో నొప్పి అంటూ కుప్పకూలాడు. తోటి మిత్రులు ఆసుపత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందాడు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక చొరవతో నాలుగు రోజుల తర్వాత హన్మంతు మృతదేహం ఇల్లు చేరింది. హన్మంతుకు భార్య పద్మ, కూతుళ్లు ఇందు, లాస్యలు ఉన్నారు. అదే గ్రామంలో దండుగుల చిన్న లస్మయ్య దినసరి కూలీగా పనులు చేస్తుండేవాడు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, గల్ఫ్‌లో ఉన్న కొడుకు విజయ్‌కుమార్, ఇద్దరు కూతుళ్లు ప్రమీల, ప్రవళికలు ఉన్నారు. ఒకే గ్రామంలో ఇద్దరు మృతి చెందడంతో పండగ పూట విషాదం అలుముకుంది.

హన్మాజిపల్లికి ఎస్సీ రిజర్వేషన్ వర్తించదా..

అధికారులకు గోడు వెళ్లబోసుకున్న దళితులు



మాట్లాడుతున్న హన్మాజిపల్లి గ్రామస్థులు

గన్నేరువరం, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ వర్తించదా, ఎప్పుడూ అగ్రవర్ణాలకే రిజర్వేషన్ వస్తుందా అంటూ మండలంలోని హన్మాజిపల్లి గ్రామ దళిత కాలనీ యువకుడు అమ్మిగల్ల సుధాకర్ తన ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయం ఎదుట గ్రామానికి చెందిన దళిత కాలనీవాసులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. హన్మాజిపల్లిలో మొత్తం 1570 మంది ఓటర్లు ఉండగా అందులో 490 పైచిలుకు మంది ఎస్సీలకు చెందిన ఓటర్లు ఉన్నారని, ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన రిజర్వేషన్‌లో హన్మాజిపల్లి గ్రామంలో సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాల్లో ఎస్సీ రిజర్వేషన్ రాలేదని అన్నారు. 25 సంవత్సరాల క్రితం గ్రామంలో ఎస్సీ రిజర్వేషన్ నుంచి దళిత మహిళ సర్పంచ్ కాగా నేటి వరకు అగ్రవర్ణాలకు, బీసీలకు మాత్రమే ఎన్నికల రిజర్వేషన్ వర్తిస్తుందని అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఎస్సీల సంఖ్య 490 మంది ఉన్నా కేవలం 50మంది మాత్రమే ఓటర్ల సంఖ్యను అధికారికంగా లెక్కలు వేయడం ద్వారా తమకు ఎస్సీ రిజర్వేషన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్థానిక ఎంపీడీవోను కలిసి తమ గోడు వెళ్లబోసుకోగా 2011 జనాభా ప్రాతిపదికన గ్రామంలో ఎస్సీల జనాభా తక్కువ ఉండడం మూలంగా రిజర్వేషన్ రావడం లేదన్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు హన్మాజిపల్లి గ్రామంలో ఎస్సీ కులగణన సక్రమంగా నిర్వహించి ఎస్సీ జనాభాను నమోదు చేసి తమ గ్రామానికి రిజర్వేషన్ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్లు గ్రామంలోకి రావద్దని ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతులతో మండలంలోని మల్లారం మూలవాగులో అధికారులు ఇసుక రీచ్ నిర్వహిస్తున్నారు. ఇసుకను తరలించే ట్రాక్టర్ల అతివేగం, అధిక మొత్తంలో ట్రాక్టర్లు నడవడం ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మల్లారం గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. రోడ్లు దెబ్బతింటున్నాయని, భూగర్భజలాలు అడుగంటే ప్రమాదముందని అన్నారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వారికి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

సార్వజనీనం.. సంగీతం

నేడు అంతర్జాతీయ సంగీత దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంగీతానికి సుదీర్ఘమైన సంప్రదా యం ఉంది. అది లయ, ధ్వనిని కలిపి క్రియాత్మక శ్రావ్యమైన రేఖను ఏర్పరిచే కళారూపం. మన దేశంలో మాత్రం సింధూలోయ నాగరికత కాలం నుంచి సంగీతం ఉంద ని, వేదకాలంలో సామ సంగీతం అనే సమిష్టి సంగీ తం రూపొందిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నా యి. సామ సంగీతం ఋగ్వేదం నుంచి గ్రహించిన ఋక్కుల మీద ఆధారపడింది. సంగీతం, నాట కం, నాట్యం అనే కళలకు సంబంధించిన అతి ప్రాచీన గ్రంథం భరతుడి నాట్య శాస్త్రమే. ఆ తర్వాత మాతంగుడి బృహద్దేశి, నాన్యదేవుని భరతభాష్యం, శంకరదేవుని సంగీత రత్నాకరం వచ్చాయి. సరస్వతీదేవి రెండు కన్నులుగా చెప్పే సంగీత సాహిత్యాలకు ఈ కాలం లో ఎంతో ప్రాధాన్యం ఉంటోంది. కొన్ని ఋగ్మత లను, వ్యాధులను నయంచేయడానికి కూడా సంగీతం ఉపయోగపడుతుంది. సంగీతం మెద డుకు, ఆరోగ్యా నికి మంచి దని అధ్యయ నాలు వెల్ల డించాయి.

నేపథ్యం..

సంగీతంలోని వివిధ రూపాలను, సం గీతకారులను, వివిధ సంస్కృ తులను, ప్రజలను ఒక చోట చేర్చడంలో సంగీతం పాత్ర ప్రపంచ వ్యాప్తంగా జరుపుతారు. అంతర్జాతీయ సంగీత దినోత్సవాన్ని ఏటా అక్టోబరు 1న నిర్వ హిస్తారు. 1975లో అంతర్జాతీయ సంగీత మండలి దీన్ని ఆమోదించింది. 1973లో స్విట్జర్లాండ్‌లోని లౌసాన్‌లో జరిగిన 15వ అంతర్జాతీయ సంగీత మండలి జనరల్ అసెంబ్లీలో సంగీతానికి ప్రత్యేక రోజును అంకితం చేయాలని తీర్మానం చేశారు. 1974లో ఐఎంసీ అధ్యక్షుడైన వయోలిన్ విద్వాంసుడు యెహూది మెనూహిన్ ప్రతీ యేటా అక్టోబరు 1న ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించారు. అక్టోబ రు 1, 1975న తొలి అంతర్జాతీయ సంగీత దినోత్సవాన్ని నిర్వహించారు.

ప్రాధాన్యం

సంగీతం ద్వారా శాంతి, సామరస్యాన్ని పెంపొందించడం, ప్రజలను ఏకం చేయడం ఈ దినోత్సవ ముఖ్య లక్ష్యాలు. ప్రపంచ వ్యాప్తంగా 150కి పైగా దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. ప్రజలు సంగీతాన్ని ఆస్వాదించడానికి కొత్త సంగీత శైలులను తెలుసుకునేందుకు, సంగీతకారులను గౌరవించడానికి ఈ రోజు ఒక మంచి అవకాశం. మూడు నెలల నుంచే సంగీతాన్ని అభ్యసించవచ్చు. కొన్ని దేశాల్లో ఏకాగ్రత, ఆనందం, ఉల్లాసం కోసం విద్యాలయాల్లో గాత్ర, వాయిద్య సంగీతం ప్రత్యేకంగా నేర్పుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఒకే సంగీత పాఠశాల

సంగీతానికి విస్తృత ప్రాచుర్యం పెరగడంతోపాటు ప్రతీ ఒక్కరు సరిగమలు నేర్చుకుంటున్న తరుణంలో ఉమ్మడి జిల్లాలో ఒకే సంగీత కళాశాల ఉండడం సంగీత ప్రియుల ను కలవరానికి గురి చేస్తుంది. ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో 1992లో ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి అనుబంధంగా సంగీత కళాశాలను ప్రారం భించింది. దాదాపు వాయిద్య పరికరాలు ఉన్నా సరిపడా శిక్షకులు లేరు. ఏ కోర్సుకైనా నాలుగు సంవత్సరాల వ్యవధి ఉంటుంది. దీని తర్వాత సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తారు. రెండు సంవత్సరాల శిక్షణ అనంతరం డిప్లొమా ప్రదానం చేస్తారు. హిందూస్థానీ, కర్ణాటక గాత్రం, వాయోలిన్, వీణ, సీతార్ వంటివి నేర్పేందుకు కొన్నేళ్లుగా శిక్షకులు లేక పోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఉమ్మడి జిల్లాతో పాటు సమీప జిల్లాల్లో కూడా సంగీత పాఠశాల, కళాశాల లేకపోవడం, ఉన్న మంథని కళాశాలలో శిక్షణ కొరవడడం సంగీత ప్రియులను నిరాశకు గురి చేస్తోంది. సంగీత ప్రేమికులకు శిక్షణ అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది.

ఎస్సారెస్పీ నుంచి 3.25లక్షల క్యూసెక్కుల నీరు విడుదల



జగిత్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 39 గేట్లు ఎత్తి 3,25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదా వరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తు తం 59.238 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 400 క్యూ సెక్కులు విడుదల చేస్తున్నారు.

ఎల్‌ఎండీ గేట్లు మూసివేత : తగ్గిన ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఎగువన మిడ్ మానేరు, మోయ తుమ్మెద వాగు నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో మంగళవారం ఉదయం ఎల్ ఎండీ స్పిల్‌వే ఆరు గేట్లు మూసివేశారు. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645 టీఎంసీ ల నీరు ఉంది. మోయతుమ్మెదవాగు నుం చి 2904 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ కాకతీ య కాలువ నుంచి 850 క్యూసెక్కులు మొ త్తం 3,754 క్యూసెక్కులు ఎల్‌ఎండీలోకి వస్తోంది.

సిద్ధిధాత్రి రూపంలో దర్శనం ఇచ్చిన అమ్మవారు



ధర్మపురి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి అనుబంధ శ్రీ రామ లింగేశ్వరస్వామి ఆలయం లో దసరా నవరాత్రోత్సవా లు తొమ్మిదో రోజు మంగళ వారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారు సిద్ధిధాత్రి రూపంలో భక్తు లకు దర్శనం ఇచ్చింది. ఆల య వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ యోగా, ఉగ్ర నారసింహస్వామి వారల సేవలను సింహవాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహాశక్తి సేవా సమితి, తిమ్మాపూర్ శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో అమ్మ వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

మహాగౌరి అలంకారంలో అమ్మవారి దర్శనం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వ రస్వామి ఆలయంలో దుర్గా ష్టమిని పురస్కరించుకుని అమ్మ వారు మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు. శ్రీదేవినవ రాత్రి ఉత్సవాలలో భాగంగా తొ మ్మిదో రోజు మంగళ వారం ఆలయ అర్చకులు శ్రీరాజ రాజేశ్వరస్వామి ఆలయం లో గోపూజతో కార్యక్ర మాల ను ప్రారంభించారు. శ్రీలక్ష్మీగణపతికి మహాభిషేకం, రాజరాజేశ్వర స్వామి వారికి మహా న్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వ హించారు. రాజరాజేశ్వరీదేవికి 108 మంది బ్రహ్మణులతో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అలాగే రాజన్న ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. మహిషాసురమర్ధిని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎట్టకేలకు ఉత్పత్తి దశలోకి ఆర్‌ఎఫ్‌సీఎల్



- హెచ్‌టీఆర్ వైఫల్యంతో అమ్మోనియా లీకేజీ
- 46 రోజులు ప్లాంట్‌లో మరమ్మతు
- డెన్మార్క్ నుంచి నిపుణులు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో ఉత్పత్తి జరిగేలా చర్యలు
- నేటి నుంచి తిరిగి యూరియా ఉత్పత్తి

కోల్‌సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)ను 46రోజుల విరామం తరువాత ఎట్టకేలకు మంగళవారం ఉత్పత్తి దశలోకి తీసుకు వచ్చారు. ప్లాంట్‌ను లైట్ అప్ చేశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కీలకమైన హెచ్‌టీఆర్ ఫెయిల్ అయ్యింది. ప్రయోగాత్మకంగా కేవలం ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోనే ఈ టెక్నాలజీని ప్రవేశపెట్టారు. పునరుద్ధరించిన ఐదు ఎరువుల కర్మాగారాల్లో రామగుండంలోనే ఈ టెక్నాలజీని ప్రవేశపెట్టడం వల్ల ప్లాంట్ ఆరంభం నుంచే సమస్యలు ఉత్పత్తన్న మయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్‌టీఆర్‌ను బైపాస్ చేసి ఉత్పత్తి చేస్తున్నారు. ప్లాంట్ రోజుకు 3850టన్నుల సామర్థ్యం కాగా హెచ్‌టీఆర్‌ను బైపాస్ చేయడంతో రోజుకు 3500టన్నుల నుంచి 3600టన్నులు ఉత్పత్తి చేశారు. హెచ్‌టీఆర్ పని చేయకపోవడంతో గ్యాస్ ఒత్తిడిలో హెచ్చు తగ్గులు వచ్చి అమ్మోనియా పైప్‌లైన్ లీకైం ది. దీంతో ఆగస్టు 14న ఉత్పత్తి నిలిపివేశారు. ప్లాంట్‌ను ఎలా పున రుద్ధరించాలనే విషయాలపై మల్లగుల్లాలు పడ్డారు.

చివరికి ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు టెక్నాలజీ సరఫరా చేసిన డెన్మార్క్‌కు చెందిన హల్దర్ టాప్స్ సంస్థ ఇంజనీర్ వచ్చే వరకు ప్లాంట్‌లో మరమ్మతులు సాధ్యం కాలేదు. ఎల్‌అండ్‌టీ నిపుణుల సహకారంతో మరమ్మతు పనులు చేశారు. ఈ హెచ్‌టీఆర్‌ను మరమ్మతు చేయా లంటే సాధ్యమయ్యే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా ప్రైమరీ రిఫార్మర్ ద్వారానే ఉత్పత్తి జరిగేలా చర్యలు చేపట్టారు. ఇందుకు విడిభాగాల మరమ్మతులు చేశారు. కొన్ని విడి భాగాలను హైదరాబాద్‌కు పంపించి రిపేర్లు చేయిం చారు. 46రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోవడంతో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు 1.77లక్షల టన్నుల ఉత్పత్తి నష్టం జరిగింది. రూ.120కోట్ల వరకు ఆర్థిక నష్టం ఏర్ప డింది. కీలకమైన సమయంలో ప్లాంట్ ఉత్పత్తి నిలిచిపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళనకు గురయ్యాయి.

తెలంగాణలో తీవ్ర యూరియా కొరత ఏర్పడింది. వర్షాకాల సీజన్‌లో గతంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచే సుమారు 2.5లక్షల టన్నుల యూరియా సరఫరా జరిగేది. ఈ సారి ప్లాంట్‌లో సాంకే తిక అవరోధాల మూలంగా యూరియా సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌లు ఆర్‌ఎఫ్‌సీ ఎల్ వైఖరిని తప్పు పట్టారు. ఒక సమయంలో ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి నిలిపివేతపై రాష్ట్ర ప్రభుత్వవర్గాలు సందేహాలు కూడా వ్యక్తం చేశాయి. ఇంటెలి జెన్స్‌తో విచారణ జరిపించాయి. ప్లాంట్‌లో ఉన్న స్టాక్‌ను పెద్దపల్లి జిల్లా అవసరాలకు ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజ మాన్యం ఇచ్చింది. ఆర్‌ఎఫ్‌సీఎల్ మరమ్మతులు కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వశాఖ కార్యదర్శి రజత్ కుమార్ ఎప్పటికప్పుడు సమీక్షించారు.

ప్లాంట్‌లో బుధవారం యూరియా ఉత్పత్తి జరుగనున్నది. రోజుకు 3850టన్నుల సామర్థ్యం గల ప్లాంట్‌లో మొదట తక్కువ లోడ్‌తో ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో యాజమాన్యం ఉన్నది. నెల రోజుల్లో యాసంగి సీజన్ ప్రారంభమవుతున్న పరిస్థితుల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉత్పత్తిలోకి రావడంతో రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు కూడా ఊపిరి పీల్చుకున్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యంతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారు.

రాంచంద్రాపూర్, కురుమపల్లి సర్పంచ్ ఎన్నికలు వాయిదా

సైదాపూర్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాంచంద్రాపూర్, కురుమపల్లి గ్రామాలకు సర్పంచ్ ఎన్నికల ను కోర్టు ఉత్తర్వుల మేరకు ఎలక్షన్ కమిషన్ వాయిదా వేసినట్లు ఎంపీ డీవో యాదగిరి తెలిపారు. మళ్లీ ఎప్పుడు ఎన్నికలు నిర్వహించేది ఎన్నికల కమి షన్ నిర్ణయిస్తుందన్నారు. రాంచంద్రా పూర్ గ్రామానికి కురుమ పల్లి అను బంధ గ్రామంగా ఉండేది. అయితే కురు మపల్లి గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు రాంచంద్రాపూర్ గ్రామ పంచాయతీ తీర్మానంతో కురు మపల్లి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. రాం చంద్రాపూర్ గ్రామంలోని కొందరు వ్యక్తు లు కరుమపల్లి గ్రామాన్ని నిబంధన లకు విరుద్ధంగా నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారని, దానిని రద్దు చేసి కురుమపల్లి, రాంచంద్రాపూర్ గ్రామాలను కలిసి ఉమ్మడి గ్రామ పంచాయతీగా కొన సాగించాలని హైకోర్టును ఆశ్రయించారు. దాంతో కోర్టు స్టే విధించింది. అయినప్పటికీ అధికారులు రెండు గ్రామాలకు సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్ ఖరారు చేశారు. అయితే రెండు గ్రామాలకు ఎన్నికల కమి షన్ ఎన్నికలు రద్దు అని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆశావహులు నిరాశలో ఉన్నారు.



ప్రపంచ మానవాళిని ఏకం చేస్తున్న అనువాదకులు



డాక్టర్ నలిమెల భాస్కర్‌ను సన్మానిస్తున్న క్లబ్ బాధ్యులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ విజ్ఞానాన్ని మానవాళి ముంగిట నిలుపుతూ ఏకం చేస్తున్న అనువాదకుల పాత్ర అనన్య సామాన్యమని లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం లీడ్ ఇండియా, శాతవాహన లయన్స్‌క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపం చ అనువాద దినోత్సవ కార్యక్రమంలో ప్రముఖ రచయిత, కవి, అను వాద ప్రక్రియలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలి మెల భాస్కర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మా ట్లాడుతూ ఇతర భాషల్లో దాగిన విజ్ఞానాన్ని మన భాషలోకి అనువా దం చేసి ఎంతో మేలు చేస్తున్నారన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ నలిమెల భాస్కర్, వారాల ఆనంద్ అనువాద రచనలతో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను పొందడం గర్వకారణమన్నారు. కా ర్యక్రమంలో కోమళ్ల రాజేందర్‌రెడ్డి, ఇనుగుర్తి రమేశ్, డాక్టర్ సుంకోజు మనోహరాచారి, మేచినేని సత్యనారాయణరావు, పచ్చునూరి సురేందర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళ వారం బీజేపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధ వారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు కరీం నగర్‌కు రానున్నట్లు చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ సార థ్యంలోని ప్రభుత్వంద్వారానే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధిపనులపై విస్తృత ప్రచా రం చేపట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల పై ప్రశ్నించాలని, మోసపూరితమైన పాలనపై ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మాజీ మేయర్ సునీల్ రావు, బాస సత్య నారాయణరావు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీసు శాఖలో ముగ్గురు పోలీసు అధికారులు వివిధస్థాయిలో పని చేసి పదవీ వరమణ పొందగా మంగళవారం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం సనాన్మిం చారు. కరీంనగర్ సీఎస్‌బీ ఎస్సై ఆర్.రవీందర్ రెడ్డి, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ ఎన్. భాస్కరచారి, కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వర్లు పదవీవిరమణ పొందారు. ఈ సందర్భం గా సీపీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న అధికా రులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, పోలీస్ అసోసియేషన్‌అధ్యక్షులు, ఎస్సై మామిడి సురేందర్ పాల్గొన్నారు.



పోలీసు అధికారులను సన్మానిస్తున్న సీపీ గౌస్ ఆలం

7న 'రెవా' ఆధ్వర్యంలో ధర్నా

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రెవా) ఆధ్వర్యంలో అక్టోబరు 7న కలెక్టరేట్ ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలో నిర్వహించిన రేవా ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం కల్పించాల్సిన ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె జగ దీశ్వరాచారి, కోశాధికారి కనపర్తి దివాకర్ మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులకు ప్రభుత్వం ప్రయోజనాలను వెంటనే కల్పించాలని లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

కరీంనగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. జిల్లాలో రెండు విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు, రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు (సర్పంచ్, వార్డు సభ్యులు)ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. మొదటి విడతలో హుజూరాబాద్ రెవిన్యూ డివిజన్ పరిధిలోని ఇల్లంత కుంట, జమ్మికుంట, హుజురాబాద్, శంకరపట్నం, వీణ వంక, వి సైదాపూర్ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. రెండో విడతలో కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని చిగురుమామిడి, చొప్పదండి, గంగాధర, గన్నేరువరం, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, మానకొండూర్, రామడుగు, తిమ్మాపూర్ మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు మొదటి విడతలో కరీం నగర్ డివిజన్ పరిధిలోని మానకొండూర్ మండలం మినహా అన్ని మండలాల పరిధిలోని గ్రామపంచాయతీలకు జరుగుతాయని తెలిపారు. రెండో విడతలో హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలు సహా మానకొండూర్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ఉంటాయన్నారు. సర్పంచ్ వార్డు, సభ్యుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహించిన రోజే ఫలితాలు వెలువడతాయన్నారు. జడ్పీ టీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు నవంబరు 11న ఉం టుందని అన్నారు. ఎంపీటీసీ, జడ్పీ టీసీ ఎన్నిక లకు కరీంనగర్ ఎస్సారార్ డిగ్రీ కళాశాల, అంబేద్కర్ స్టేడియం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్లు స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

సమావేశలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో జగదీశ్వర్, కాంగ్రెస్ ప్రతినిధులు డీసీసీ ప్రధానకార్యదర్శి సిరాజ్ హుస్సేన్, మడుపు మోహన్, బీజేపీ ప్రతి నిధులు నాంపల్లి శ్రీనివాస్, బాస సత్యనారాయణ, వాసాల రమేష్, బీఆర్ఎస్ ప్రతినిధి సాతినేని శ్రీని వాస్, సీపీఎం ప్రతినిధి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ ప్రతినిధి మణి కంఠరెడ్డి, ఏఐఎంఐఎం ప్రతినిధి సయ్యద్ బర్కత్ అలీ, టీడీపీ ప్రతినిధి కళ్యాడపు ఆగయ్య, బీఎస్పీ ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉంటేనే గుండె జబ్బుల నియంత్రణ

ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏవీ గిరిసింహారావు



ఆర్టీసీ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఏవీ గిరిసింహారావు

భగత్‌నగర్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు దూరంగా ఉంటేనే గుండె జబ్బులను నియంత్రించ వచ్చని కరీంనగర్ ఆర్టీసీ జోనల్ హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏవీ గిరిసింహారావు అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మంగళశారం ఆర్టీసీ జోనల్ ఆస్పత్రి లో సంస్థ ఉద్యోగులకు గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ హృదయం పదిలంగా ఉంచుకోవాలని, వ్యసనాల నుంచి వ్యాపకాలకు మళ్లాలని అన్నారు. షుగరు, బీపీ, కొలస్ట్రాల్, ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవడంతోనే గుండె జబ్బుల నియంత్రణకు మార్గమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహాశక్తి ఆలయంలో మాజీ ఎమ్మెల్సీ పూజలు



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో మాజీ ఎమ్మెల్సీ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాశక్తి ఆలయంలో మంగళవారం హైదరాబాద్ మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి ఉమ్మడి జిల్లా యువ మోర్చా మాజీ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, పృథ్వీధర్‌రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, దామర మహేందర్‌రెడ్డి, మందల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ఎంపికైన నరేష్‌కు ఎమ్మెల్యే అభినందన

తిమ్మాపూర్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 ద్వారా ఎంపీడీవోగా ఎంపికైన రామడుగు మండలం రుద్రారం గ్రామానికి చెందిన నాగం నరేష్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసేందుకు నరేష్ క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. దీంతో నరేష్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. నరేష్ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో పోలీస్‌శాఖలో ఆర్ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ గ్రూప్-1 పరీక్ష రాసి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నరేష్ తండ్రి లక్ష్మీరాజం, మండల నాయకులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలిపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు పని చేయాలని పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. మంగళవారం కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి, చామనపల్లి, బహదూర్‌ఖాన్ పేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కరీంనగర్ నియోజక వర్గానికి సీఎం రేవంత్ రెడ్డి 4 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు



దుర్గా అలంకరణలో అమ్మవారు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కరంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారు మంగళవారం దుర్గా అలంకరణలో సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు పవన కృష్ణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గామాత మండపంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేశిని రాధా- సదానందం, యువశక్తి యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలోని దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా చండీయాగం నిర్వహించారు.

రాంలీలాను రాజకీయం చేస్తే ఊరుకోం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో దసరా రోజు నిర్వహించే రాంలీలా కార్యక్రమాన్ని రాజకీయం చేస్తామంటే ఊరుకోబోమని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విగ్రహం ఏర్పాటు విషయంలో మార్క్‌ఫెడ్ అధికారులకు కనీస సమాచారం ఇవ్వలేదని, అందుకే గేటుకు తాళం వేశారని పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ నాయకులను బాధ్యులను చేయడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ప్రొటోకాల్ పాటించాల్సిందేనని తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

హుజూరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం బీఆర్ఎస్ ఎప్పుడో మద్దతు ఇచ్చిందని, తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. పార్టీ అభ్యర్థులకు అండగా ఉండి గెలిపించుకుంటానన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు. యూరియా కోసం రైతులను రోడ్డుపై నిల బెట్టిందన్నారు.



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని మహాశక్తి దేవాలయంలో అమ్మవార్లను పాడి కౌశిక్‌రెడ్డి దర్శించుకున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిగురుమామిడి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ జన్మదిన వేడుకలను మంగళవారం చిగురుమామిడిలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. బస్టాండ్ అవరణలో ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు దేవాలయాల్లో ప్రధాన అర్చకులు అకావరం శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మామిడి అంజయ్య, అన్ని గ్రామాల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పురాణ నిధి యాప్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవతా స్తోత్రాలు, పురాణ గాధలను సామాన్యులకు అర్థమయ్యేలా అందించేందుకు రూపొందించిన పురాణనిధి యాప్‌ను మంగళవారం పురాణం మహేశ్వరశర్మ నివాసంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆవిష్క రించారు. హైందవ సంస్కృతి, చరిత్ర నేటి తరానికి చేరువ య్యేందుకు మంగళంపల్లి వేణుగోపాలశర్మ, పురాణం మహేశ్వరశర్మ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్ పుస్తకం అందజేత

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రచయిత సబ్బని లక్ష్మీనారాయణ సంపాదకత్వంలో వెలువడిన ఆపరేషన్ సిందూర్ పుస్తకాన్ని మంగళవారం మహాశక్తి ఆలయంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు అందజేశారు. కోల అన్నారెడ్డి, ఉప్పల రామేశం, వెల్మల జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● రచయిత్రి అనంతోజు పద్మశ్రీ రచించిన బతుకమ్మ పాటల పుస్తకాన్ని మంగళవారం మహాశక్తి ఆలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు అందజేశారు. జూపాక మల్లేశం, శాలిని, శ్రీజ పాల్గొన్నారు.

సీపీని కలిసిన టీఎన్‌జీఓస్ నాయకులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు మంగళవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను మర్యాద పూర్వకంగా కలిశారు. సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షులు రాజేష్ భరద్వాజ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఏవీ రాజేశ్వరరావు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కోటా రామస్వామి, శంకర్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతిన జీవహింసపై చర్యలు

హుజూరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 2 గాంధీ జయంతిన జీవహింస చేస్తే చర్యలు తీసుకుం టామని హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చికెన్, మటన్ షాపులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రైనీ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్‌గా షాగుఫ్తా ఫిర్దోస్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రైనీ జిల్లా రిజిస్ట్రార్‌గా షాగుఫ్తా ఫిర్దోస్ పోస్టింగ్ పొందారు. ఆమె తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (గ్రూపు-1) ద్వారా ఇటీవల డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్(డీఆర్)గా ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఆర్‌గా కరీంనగర్ డీఆర్ కార్యాలయంలో వివిధస్థాయిలో శిక్షణ పొందనున్నారు.

సమన్వయ కమిటీ ఏర్పాటు

ఇల్లందకుంట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం మండల సమన్వయ కమిటీని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రకటించారు. కమిటీ సభ్యులుగా కనుమల్ల గణపతి, పోడేటి రామస్వామి, సరిగోమ్ముల వెంకటేష్, కాలాల రాజిరెడ్డి, చుక్క రంజిత్, కొంరెల్లి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, కుమార్, అయిలయ్య, రాకేష్, తిరుపతిరెడ్డి, దిలీప్‌రెడ్డి, మొగిలి, మసూద్ అహ్మద్‌ఖాన్, వాసుదేవరెడ్డి, సచిన్‌రెడ్డి ప్రకటించారు.

రైతులు వడ్డీ రాయితీ ఉపయోగించుకోవాలి

జమ్మికుంట, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వం మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్ అన్నారు. మంగళవారం జమ్మికుంటలో చైర్మన్ అధ్యక్షతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 84వ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి, సీఈవో రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.

17వ డివిజన్‌లో చెట్ల పొదలు తొలగించండి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 17వ డివిజన్ విజయదుర్గకాలనీ రోడ్ నంబరు 2 నుంచి జగిత్యాల రోడ్డుకు వెళ్లే దారికి ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించాలని బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు.

దుర్గామాతకు వెండి కిరీటం బహూకరణ

రామడుగు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామంలో దుర్గా సోమేశ్వరస్వామి ఆలయంలోని దుర్గామాత అమ్మవారికి లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వీర్లప్రభాకర్‌రావు మనువడు కొప్పుల సాయిచరణ్ వెండి కిరీటాన్ని బహూకరించారు. మంగళ వారం ఆలయ అర్చకులకు వెండి కిరీటాన్ని అందజేశారు.

'వజ్జాలగ్గం' గ్రంథావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సర్వవైదికసంస్థానం ఆధ్వర్యంలో మంగళవారం యజ్ఞవరాహక్షేత్రంలో వరంగల్‌కు చెందిన సాహితీవేత్త డాక్టర్ మాదిరాజు బ్రహ్మానందరావు 'వజ్జాలగ్గం' గ్రంథాని ఆవిష్కరించారు. ఎస్‌వీఎస్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్-కల్యాణి దంపతులకు పుస్తకాన్ని అంకితమిచ్చారు. పరిశోధకుడు, సాహితీవేత్త డాక్టర్ ఏల్చూరి మురళీధరరావు, సాహితీవేత్తలు ఆచార్య యాదగిరి, డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, ఆచార్య ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిందం సునీతకు అభినందనలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల సాహితీ కిరీటి పురస్కారాన్ని అందుకున్న రచయిత్రి చిందం సునీతను మంగళవారం ఆమె నివాసంలో పలువురు అభినందించారు. గజవాడ అశోక్, నార్ల శ్రీనివాస్, పెద్దిరాజు సత్యనారాయణ రాజు, బొమ్మకంటి కిషన్ ఉన్నారు.

నిమజ్జనానికి క్రేయిన్ సౌకర్యం కల్పించాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు చింతకుంట, కొత్తపల్లిలో క్రేయిన్లు ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు వైద్యుల అంజన్‌కుమార్ కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందజేశారు. అక్టోబర్ 2,3,4 తేదీల్లో దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, వీరదేవేందర్, అరుణ్‌కుమార్, రేగొండ సంతీప్, సిరిపురం మనోజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొలిమికుంటలో బతుకమ్మ వేడుకలు

చొప్పదండి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలిమికుంటలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల వద్ద ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.

అనాథ వృద్ధులకు ఆర్థిక సహాయం

ఇల్లందకుంట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోటపోతుల దేవేందర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఉజ్వల్ జమ్మికుంట బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థలోని అనాథ వృద్ధులకు రూ.5వేల ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. బాలవికాస సెంటర్ మేనేజర్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

